www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily | బుధవారం 19,ఆగస్టు, 2026

# ఇరిగేషన్ ఇరిటేషన్





2 లో..

పూడుకుపోయిన కాల్వ

తాలిపేరు నీరు రోడ్డు పాలు

రైతులకు సాగునీటి వ్యధ

అధికారుల నిర్లక్ష్యం... అన్నదాతకు శాపం -

బాధ్యతారహిత్యంగా ఇరిగేషన్ శాఖ

సాగు నీటిని సక్రమంగా అందించలేని దుస్థితి

అన్నదాతల్లో అసహనం

రాళ్ల గూడెం రైతుల గోడు పట్టించుకునేది - వరు..?

కాగితాల్లోనే పనులు

క్షేత్రస్థాయిలో సమస్యలు

ఇరిగేషన్ శాఖ నిర్లక్ష్యం రైతులకు ఇరిటేషన్ తెప్పిస్తుంది. పంట పొలాలకు సక్రమంగా నీళ్లు అందించాల్సిన బాధ్యతను విస్మరిస్తున్న అధికారుల తీరు వల్ల రైతాంగం నష్టపోవాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. క్షేత్రస్థాయిలో జరగాల్సిన పనులపై ఉదాసీనంగా వ్యవహరిస్తున్న ఇరిగేషన్ శాఖ తీరుతో తాలిపేరు ప్రాజెక్టు కింద సాగునీరు రైతుల పొలాలకు వెళ్లే విషయంలో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి అయినా సరే పట్టించుకునే నాధుడే కరువయ్యారు .

చర్ల , ఆగస్టు 18 (భద్రాద్రి న్యూస్):

## కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో జాప్యం లేకుండా చర్యలు

దిశా కమిటీ చైర్మన్, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి



6లో



2 లో..

## ములుగు జిల్లా కలెక్టర్ బోర్కాడే హేమంత్ ను సన్మానించిన తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్

# ఇరిగేషన్.. ఇరిటేషన్





మొదటి పేజీ తరువాయి

రైతుల పంట పొలాలకు చేరాల్సిన తాలిపేరు ప్రాజెక్టు సాగునీరు అధికారుల నిర్లక్ష్యంతో రోడ్డుపాలవుతోంది. రాళ్లగూడెం గ్రామ పరిధిలో సాగునీటి కాలువ పూడిక, చెత్తాచెదారంతో పూర్తిగా నిండిపోవడంతో నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడి, పొలాలకు వెళ్లాల్సిన నీరు ప్రధాన రహదారిపైకి పొంగిపొర్లుతోంది. దీంతో విలువైన సాగునీరు వృథాగా పోతుండగా.. రైతులు మాత్రం పంటలకు నీటి కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది.

రైతుల పొలాలకు నీరు చేరేలా కాలువలను నిర్వహించడం ఇరిగేషన్ శాఖ ప్రాథమిక బాధ్యత కాదా? అని గ్రామస్తులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. కాలువలో పూడిక పేరుకుపోయి నీరు పొలాలకు వెళ్లకుండా రోడ్డుపైకి వస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. రైతులకు అందాల్సిన నీటిని సక్రమంగా మళ్లించలేని పరిస్థితి ఉంటే తాలిపేరు ప్రాజెక్టు నీటి ప్రయోజనం రైతులకు ఎలా అందుతుందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ప్రతి చుక్క నీరు రైతుకు ప్రాణాధారం.. అధికారులు మాత్రం పట్టించుకోరా?

ఇప్పటికే వర్షాలు సరిగా లేక సాగునీటి కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి సమయంలో ప్రాజెక్టు నుంచి అందుబాటులోకి వస్తున్న నీటిని సైతం కాలువల నిర్వహణ లోపంతో రోడ్డుపైకి మళ్లించడం రైతుల పట్ల అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని గ్రామస్తులు మండిపడుతున్నారు. పంటలకు చేరాల్సిన నీరు రోడ్డుపై ప్రవహిస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారంటూ రైతులు నిలదీస్తున్నారు. కాలువలో పూడిక తొలగించడం, నీటి ప్రవాహాన్ని సక్రమంగా మళ్లించడం వంటి కనీస చర్యలు కూడా చేపట్టకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### సాగునీరు వృథా.. రహదారిపై ప్రమాద ముప్పు

కాలువ నుంచి పొంగిపొర్లుతున్న నీరు ప్రధాన రహదారిపైకి చేరుతుండటంతో వాహనదారులకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్డుపై నీరు నిలిచి ఉండటంతో వాహనాలు అదుపుతప్పే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతుల సాగునీటి సమస్యతో పాటు ప్రజల రహదారి భద్రతకు కూడా ఈ పరిస్థితి ముప్పుగా మారిందని పేర్కొంటున్నారు.

### ఇంకెంతకాలం నిర్లక్ష్యం?

సమస్య కళ్లముందే కనిపిస్తున్నా అధికారులు స్పందించకపోవడంపై రాళ్లగూడెం రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగితాలపై పనులు చూపించడం కాదు.. క్షేత్రస్థాయిలో కాలువను పరిశీలించి పూడికను తొలగించి నీటిని పొలాలకు మళ్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇరిగేషన్ అధికారులు తక్షణమే గ్రామాన్ని సందర్శించి కాలువలో పేరుకుపోయిన పూడిక, చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగించాలని, అవసరమైన మరమ్మతులు చేపట్టి తాలిపేరు నీరు ప్రతి ఎకరాకు సక్రమంగా చేరేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. రైతుల పంటలకు చేరాల్సిన నీరు రోడ్డుపై వృథాగా పారిపోతుంటే చూస్తూ ఊరుకునే పరిస్థితి లేదని, అధికారులు ఇప్పటికైనా మేల్కొని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రాళ్లగూడెం గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. రైతుల ప్రయోజనాలే ప్రాధాన్యంగా భావించి ఇరిగేషన్ శాఖ అధికారులు వెంటనే స్పందించాలని వారు కోరుతున్నారు.

# ములుగు జిల్లా కలెక్టర్ బోర్కాడే హేమంత్ ను సన్మానించిన తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్

**భద్రాద్రి న్యూస్ ములుగు**

ములుగు జిల్లా కలెక్టర్ శ్రీ బోర్కాడే హేమంత్, ఐ.ఏ.ఎస్. గారిని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (TGOs) ములుగు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

ఈ నెల 16వ తేదీన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి మరియు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి ధనసరి అనసూయ సీతక్క గార్ల చేతుల మీదుగా ములుగు జిల్లా ఉమ్మడి సమీకృత కార్యాలయాల భవనం (IDOC) ప్రారంభోత్సవం, అలాగే రాష్ట్ర పంచాయతీరాజ్ రోడ్ల పైలాన్ ఆవిష్కరణ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి.

ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి విజయవంతం చేసినందుకు జిల్లా కలెక్టర్ శ్రీ బోర్కాడే హేమంత్, ఐ.ఏ.ఎస్. గారికి తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ములుగు జిల్లా శాఖ పక్షాన శుభాకాంక్షలు తెలియజేస్తూ జిల్లా అధ్యక్షులు శ్రీ ఎం. సంపత్ రావు గారు కలెక్టర్‌ను సన్మానించారు.

అదేవిధంగా జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీ సి.హెచ్. మహేందర్ గారిని కూడా జిల్లా అధ్యక్షులు శ్రీ ఎం. సంపత్ రావు గారు సన్మానించారు.

ఈ కార్యక్రమంలో ౧+ూం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ కందుల జీవన్ కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీ కొమరయ్య, ఉపాధ్యక్షులు శ్రీమతి కే. శిరీష, శ్రీ విజయ భాస్కర్, శ్రీ ఏ. రాజ్ కుమార్, శ్రీ బి. యశ్వంత్, జాయింట్ సెక్రెటరీలు శ్రీ రఫీక్, శ్రీమతి శైలజ, శ్రీ డి. రాజు, శ్రీ రహీముద్దీన్, అలాగే శ్రీమతి ప్రేమలత, శ్రీ ధర్మానాయక్, శ్రీ కృపాకర్, శ్రీ సంజీవ రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టరేట్ సాధించిన పి. జ్యోతి



**చంద్రుగొండ/జూలూరుపాడు ఆగస్టు 18 (భద్రాద్రి న్యూస్)ప్రతినిధి :**

ఉస్మానియా విశ్వవిద్యాలయం జంతుశాస్త్ర విభాగం పరిశోధకురాలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం అయ్యన్నపాలెం గ్రామానికి చెందిన పి. జ్యోతి డాక్టరేట్ (పీహెచ్‌డీ) పట్టాకు అర్హత సాధించారు.తెలంగాణలోని నర్సంపేట, పాల్వంచ మండలాల్లో నేలలోని కీటకాలు, ఇతర సూక్ష్మజీవుల వైవిధ్యం, విస్తరణపై ఆమె పరిశోధన చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం జంతుశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. వై. సునీల కుమారి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసి, పీహెచ్‌డీ వైవా-వోస్‌లో విజయవంతంగా ఉత్తీర్ణత సాధించారు. జ్యోతి భర్త డా. బి. శ్రీనివాస్ కూడా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో భౌతికశాస్త్రంలో 2024లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. భార్యాభర్తలిద్దరూ వేర్వేరు శాస్త్ర విభాగాల్లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్లు సాధించడం విశేషం.ఈ సందర్భంగా డా. జ్యోతికి కుటుంబ సభ్యులు, అధ్యాపకులు, సహచరులు, గ్రామస్తులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు.

# పలు కుటుంబాలకు మాజీ ఎంపీ నామ పరామర్శ

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్ట్ 18 (భద్రాద్రిన్యూస్ ):-**

ఖమ్మం నగరంలో ఇటీవల మృతి చెందిన పలువురు కుటుంబాలను బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ముందుగా ముస్తఫానగర్‌కు చెందిన బొమ్మ విద్యా సంస్థల వైస్ చైర్మన్ సత్యప్రసాద్ ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో ఆయన తండ్రి, బొమ్మ విద్యా సంస్థల చైర్మన్ రాజేశ్వరరావుతో పాటు కుటుంబ సభ్యులను మాజీ ఎంపీ నామ పరామర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన సత్యప్రసాద్ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. అనంతరం గట్టయ్య సెంటర్‌లో ఇటీవల నిర్మల్ హృదయ్ స్కూల్ ఫౌండర్, కరస్పాండెంట్ సాంబశివరెడ్డి మృతి చెందిన నేపథ్యంలో ఆయన స్వగృహానికి వెళ్లారు. అక్కడ ఆయన కుమారులు సుధాకర్‌రెడ్డి, రవి భరత్‌రెడ్డితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. సాంబశివరెడ్డి చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. తర్వాత బ్యాంక్ కాలనీ వాస్తవ్యులు అట్లూరి చంద్రశేఖర్‌రావు భార్య సులోచన ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సులోచన చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను నామ పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మాజీ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి, ఖమ్మం కార్పొరేషన్ బీఆర్ఎస్ మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ షేక్ మక్బుల్, మాజీ కార్పొరేటర్ బుడిగం శ్రీనివాస్, నాయకులు కనకమేడల సత్యనారాయణ, మోరంపూడి ప్రసాద్ రావు, మరికంటి రేణు బాబు, అమరగాని వెంకన్న, మన్నేపల్లి వెంకటేశ్వరరావు, బండారు





శ్రీను, పరమేశ్వరరావు, తన్నీరు రవి, వాకదాని కోటేశ్వరరావు, రేగళ్ల కృష్ణ ప్రసాద్, షారుఖ్ తదితరులు పాల్గొన్నారు.

# పుల్లెల గాయత్రికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అభినందనలు

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 18 (భద్రాద్రిన్యూస్ ):-**

అర్జున అవార్డుకు ఎంపికైన ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పుల్లెల గాయత్రికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అభినందనలు తెలిపారు. పిన్న వయసులోనే బ్యాడ్మింటన్‌లో అత్యుత్తమ ప్రతిభను కనబరుస్తూ అర్జున అవార్డుకు ఎంపిక కావడం అభినందనీయమని పేర్కొన్నారు. పుల్లెల గాయత్రి సాధించిన ఈ ఘనత యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తుందని కొనియాడారు. వరుస విజయాలతో దూసుకెళ్తున్న గాయత్రి అంచెలంచెలుగా ఎదుగుతూ తన తండ్రి బాడ్మింటన్ దిగ్గజం పుల్లెల గోపీచంద్ కు తగ్గట్లుగా రాణిస్తోందని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



భద్రాద్రి న్యూస్

బుధవారం 19,ఆగస్టు, 2026





# చర్ల పోలీస్ గ్రౌండ్‌లో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ సెలెక్షన్స్‌కు శ్రీకారం



**పరుగుల ట్రాక్‌పై క్రీడాకారుల దూకుడు.. రాష్ట్ర స్థాయికి సత్తా చాటేందుకు హోరాహోరీ పోటీలు**

**చర్ల, ఆగస్టు 18 (భద్రాద్రి న్యూస్):**
చర్ల పోలీస్ క్రీడా మైదానం క్రీడాకారుల పరుగులతో సందడిగా మారింది. జిల్లా స్థాయి అథ్లెటిక్స్ సెలెక్షన్స్‌ను మంగళవారం ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభించారు. ఒలింపిక్ పతాకాన్ని ఊపి పరుగుపందెం పోటీలకు చర్ల ఎస్‌హెచ్‌ఓ ఆలేం రాజు వర్మ, ఎస్ఐ నర్సిరెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె. మహీధర్ శ్రీకారం చుట్టారు. రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లే అవకాశం కోసం క్రీడాకారులు ట్రాక్‌పై చెమటోడ్చుతూ సత్తా చాటారు. ఈ నెల 26, 27 తేదీల్లో వరంగల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా స్థాయి సెలెక్షన్స్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు అర్హత సాధించనున్నారు. దీంతో విజయం సాధించాలనే పట్టుదలతో విద్యార్థులు, క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు.

**400 మీటర్ల ట్రాక్.. క్రీడాకారులకు వరం**

జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె. మహీధర్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రం తర్వాత అథ్లెటిక్స్‌కు ఇంతటి సౌకర్యవంతమైన మైదానం మరెక్కడా లేదని అన్నారు. చర్లలో నిర్మించిన 400 మీటర్ల ట్రాక్ అండ్ ఫీల్డ్ మైదానం అథ్లెటిక్స్ పోటీలకు అత్యంత అనువుగా ఉందని తెలిపారు. క్రీడాకారులకు అత్యుత్తమ వసతులతో కూడిన మైదానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిన పోలీస్ శాఖ అధికారులను ఆయన అభినందించారు. ముఖ్యంగా సీఐ రాజు వర్మ, ఎస్ఐలు నర్సిరెడ్డి, కేశవ్‌తో పాటు మైదానం ఏర్పాటుకు సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

**గ్రామీణ ప్రతిభకు వేదికగా చర్ల**

గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి సెలెక్షన్స్ ఎంతగానో దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. కష్టపడి సాధన చేసే విద్యార్థులకు ఇలాంటి మైదానాలు, పోటీలు మంచి అవకాశాలను అందిస్తాయని తెలిపారు. పరుగులో వేగం.. విజయంపై లక్ష్యం.. రాష్ట్ర స్థాయిలో జెండా ఎగరేయాలనే పట్టుదలతో క్రీడాకారులు ట్రాక్‌పై తమ సత్తా చాటారు. విద్యార్థుల్లో క్రీడా ఆసక్తిని పెంచడంతో పాటు ప్రతిభావంతులను జిల్లా, రాష్ట్ర స్థాయికి తీసుకెళ్లేందుకు అథ్లెటిక్స్ అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీ ఈశ్వర్, శ్రీను, ఏఎస్ఓ పీడీ కె. వెంకటనారాయణ, జిల్లా అథ్లెటిక్స్ కోచ్‌లు నాగరాజు, ప్రసాద్, పీఈటీ రవీందర్‌తో పాటు పలువురు కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## పట్టుదల, క్రమశిక్షణతో చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు

**విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించాలి: మేజర్ పంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం**



**చర్ల, ఆగస్టు 18 (భద్రాద్రి న్యూస్):**
విద్యార్థులు పట్టుదలతో చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని, క్రమశిక్షణతోనే అది సాధ్యమవుతుందని చర్ల మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం అన్నారు. సర్పంచ్ భర్త, యువజన కాంగ్రెస్ నాయకుడు వల్లి శ్రీకాంత్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన స్నేహితులు, 2003--04 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు చర్లలోని వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం విద్యార్థి నిలయానికి 50 కిలోల బియ్యంతో పాటు 20 స్టీల్ ప్లేట్లు, పండ్లు, స్వీట్లు అందజేశారు.
ఈ సందర్భంగా విద్యార్థి నిలయ కమిటీ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సర్పంచ్ సామ్రాజ్యం మాట్లాడారు. విద్యార్థులు ఇతర వ్యాపకాలపై దృష్టి సారించకుండా చదువుపైనే శ్రద్ధ పెట్టాలని సూచించారు. విద్యను అభ్యసిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని, చదువుకుని ఉద్యోగాల్లో స్థిరపడిన వారిని ఆదర్శంగా తీసుకుని జీవితాన్ని సుసంపన్నం చేసుకోవాలని కోరారు.



ప్రతి ఒక్కరి జీవితంలో క్రమశిక్షణ ఎంతో అవసరమని, క్రమశిక్షణతో మెలిగితే చదువుతో పాటు జీవితంలోనూ ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. గిరిజన విద్యార్థుల అభ్యున్నతి కోసం వనవాసీ సంస్థను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు సంస్థ ఆశయాలను గుర్తించి క్రమశిక్షణతో మెలుగుతూ సంస్థకు మంచి పేరు, ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు.
వనవాసీ కళ్యాణ పరిషత్ జిల్లా కార్యదర్శి కోరం సూర్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని అన్నారు. సంస్థకు ప్రభుత్వాల నుంచి ఎటువంటి ఆదాయం సమకూరడం లేదని, కేవలం దాతల సహకారంతోనే విద్యార్థి నిలయాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ విషయాన్ని గమనించి దాతలు ముందుకు వచ్చి సహకారం అందించడం శుభపరిణామమని పేర్కొన్నారు. విద్యార్థులు దాతల నమ్మకానికి అనుగుణంగా విద్యనభ్యసించి జీవితంలో స్థిరపడాలని కోరారు.
కార్యక్రమంలో వల్లి శ్రీకాంత్, పాసికంటి సంతోష్, బాజీ, గౌస్ పాషా, ఆలం సతీష్, గంప మాణిక్యాలరావు, కొండేటి చంద్రశేఖర్, తూము రాము, తోకల నాగేంద్ర, చంద్రమౌళి, సాంబ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ ఉచిత శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**–ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నిరుద్యోగ యువతకు పిలుపు**

**చంద్రుగొండ/జూలూరుపాడు ఆగస్టు 18(భద్రాద్రి న్యూస్)ప్రతినిధి :**



ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని నిరుద్యోగ యువత పోలీసు ఉద్యోగాల సాధనకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు ఎస్.కె. వసీంపాషా కోరారు.తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో రెండు జిల్లాల నిరుద్యోగ యువత కోసం ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ శిక్షణకు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.శిక్షణలో రాష్ట్రస్థాయిలో పేరొందిన అధ్యాపకులతో బోధన, ప్రామాణిక పుస్తకాల ఉచిత పంపిణీ, ప్రతిరోజూ ఓఎంఆర్ పద్ధతిలో పరీక్షలు, వారానికి ఒకసారి ప్రత్యేక పరీక్షలు, శారీరక దారుఢ్య సాధన వంటి సౌకర్యాలను కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు పోలీసు ఉద్యోగాలు సాధించేలా నూరు శాతం ఫలితాలే లక్ష్యంగా శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.పేర్ల నమోదుకు చివరి తేదీ: 27 ఆగస్టు 2026శిక్షణ ప్రారంభం: 1 సెప్టెంబర్ 2026,మరిన్ని వివరాల కోసం ఖమ్మం: 8985095599, కొత్తగూడెం: 8985096699 నంబర్లను సంప్రదించాలని సూచించారు.నిరుద్యోగ యువతకు అందుబాటులోకి వచ్చిన ఈ ఉచిత శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోలీసు ఉద్యోగ సాధన దిశగా ముందడుగు వేయాలని ఎస్.కె. వసీంపాషా కోరారు.

భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం 19,ఆగస్టు, 2026

# ఎల్ నినో ప్రభావం పై రైతులకు అవగాహన





**జూలూరుపాడు/చంద్రుగొండ(భద్రాద్రి న్యూస్)ప్రతినిధి :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం, పాపకొల్లు రైతు వేదిక నందు సోమవారం రైతులకు ఎల్ నినో ప్రభావంపై జిల్లా వ్యవసాయ అధికారి వి బాబురావు రైతులకు అవగాహన కల్పించారు. ఎల్ నినో ప్రభావంతో ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితులు ఉంటాయని కాబట్టి రైతులు వరికి బదులుగా పెసర, అపరాలు, కంది మరియు ఆయిల్ ఫామ్ సాగు చేపట్టవలసిందిగా సూచించారు. క్షేత్రస్థాయి సందర్శనలో భాగంగా కొత్తూరు గ్రామంలో రైతు రామారావు పెసర పంటను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం సహాయ వ్యవసాయ సంచాలకులు బి సుధాకర్ రావు , మండల వ్యవసాయ అధికారి జి దీపక్ ఆనంద్ పాల్గొన్నారు.

# ఆటో వర్కర్స్ నూతన కమిటీ ఎన్నిక




**జూలూరుపాడు/చంద్రుగొండ(భద్రాద్రిన్యూస్)ప్రతినిధి :**
మండల కేంద్రంలో, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల జమలయ్య ఆధ్వర్యంలో టి ఏ డి యు నుంచి 50 మంది ఏఐటియుసి లో చేరారు. వారికి జమలయ్య కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. జూలూరుపాడు టు కొత్తగూడెం అడ్డాను ఏర్పాటు. చేసుకోవడం జరిగింది, జూలూరుపాడు ఏఐటీయూసీ బస్టాండ్ అడ్డా మండల అధ్యక్షులుగా మోటపోతుల ఆనందరావు, ఉపాధ్యక్షులు పోతురాజు మురళీకృష్ణ,మరియు సపవట్ బాబూలాల్, సెక్రెటరీ మంద లక్ష్మీనారాయణ, మరియు కంగల రంజిత్ కుమార్,కోశాధికారిగా కొండ సత్యనారాయణ, ట్రెజరర్ భూక్యా రవీందర్ మరియు కాకటి సాయి ని ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన అడ్డా మండల అధ్యక్షులు మోటపోతుల ఆనందరావు మాట్లాడుతూ,ఈ అవకాశం ఇచ్చిన ఆటో సోదరులందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ నా మీద నమ్మకం ఉంచి నాకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటు అందరికీ అందుబాటులో ఉంటానని యూనియన్ లో చేరిన సభ్యుల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ ఆటో యూనియన్ సభ్యుల అందరికి న్యాయం చెసే విధంగా ఉంటానని ఎఐటియుసి నాయకుల సమక్షంలో తెలియజేసారు. అలాగే ఆటో కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇస్తామన్న హామీలు నిలబెట్టుకోవాలని అర్హులైన ఆటో కార్మికులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు ఎల్లప్పుడు అండగా ఉంటామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# హక్కుల కోసం ఆదివాసుల ఉద్యమం

### 1/70 రద్దుకు కుట్రలు ఆపాలి --ఆదివాసి సంక్షేమ పరిషత్

### 1/70 చట్ట రక్షణ కోసం ప్రతి ఆదివాసి ఒకటవ్వాలి

### ప్రతి గిరిజన గూడెం, నివాస ప్రాంతాలకు సిమెంటు రోడ్డు నిర్మించాలి

### ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టం రక్షణ కోసం ఆదివాసులు అస్తిత్వ పోరాటం చేయాలి




**వెంకటాపురం, భద్రాద్రి న్యూస్ :**
ములుగు (జిల్లా) ఏటూరునాగారం ఐ.టీ.డీ.ఏ పి.ఓ గారికి షెడ్యూల్డ్ ఏరియాలో 1/70 చట్టం రక్షణ కోసం వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా అధ్యక్షులు పర్షిక సతీష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టం రక్షణ కోసం అస్తిత్వ పోరాటం అనేది ఆదివాసుల భూమి, హక్కులు, జీవనాధారం మరియు రాజ్యాంగ పరిరక్షణ కోసం చట్టబద్ధమైన ప్రజా ఉద్యమంగా ముందుకెళ్లాలని వెళ్లాలన్నారు. 1/70 నిబంధనలు షెడ్యూల్డ్ ఏరియాల్లో గిరిజన భూముల అన్యాక్రాంతాన్ని నిరోధించేందుకు రూపొందించబడ్డాయి. ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనేతరులు 1/70 చట్టాన్ని రద్దు చేయాలని కుళ్ళ కుతంత్రాలతో కోర్టులలో కేసులు వేయడం జరిగింది. ఆ కేసులు వేసిన గిరిజనేతరలను ఏజెన్సీ వలస నిరోధక చట్టాన్ని అమలు చేసి ఏజెన్సీ ప్రాంతం నుంచి వెళ్ళగొట్టాలన్నారు.
1/70 చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి.
గిరిజన భూముల అక్రమ బదలాయింపులు, ఆక్రమణలను వెంటనే గుర్తించి రద్దు చేయాలి.
అన్యాక్రాంతమైన గిరిజన భూములను చట్ట ప్రకారం తిరిగి గిరిజనులకు అప్పగించాలి.
ప్రభుత్వ భూముల అక్రమ ఆక్రమణలను అరికట్టాలి.
ఏజెన్సీ ప్రాంతాల్లో రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ పరిరక్షణలను సమర్థంగా అమలు చేయాలి.
గ్రామసభలు, పేసా చట్టం ద్వారా ఆదివాసుల స్వపరిపాలన హక్కులను బలోపేతం చేయాలి.
చట్టాల అమలులో నిర్లక్ష్యం చేసే అధికారులపై బాధ్యత పరంగా చర్యలు తీసుకోవాలి. అని ఏటూరునాగారం ఐ.టీ.డీ.ఏ పీ.ఓ కు పలు డిమాండ్లతో వినతి పత్రం అందజేయటం జరిగింది.
భూమి కోసం కాదు---అస్తిత్వం కోసం,1/70 చట్ట రక్షణ కోసం ప్రతి ఆదివాసి ఒక్కటవ్వాలి! ఆదివాసి సమాజానికి పిలుపునిచ్చారు.
ఆదివాసి సంక్షేమ పరిషత్ వెంకటాపురం మండల ఉపాధ్యక్షులుతాటి రాంబాబు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాలలోని గిరిజన గ్రామాలు గుడాల్లో ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా సరైన అంతర్గత రహదారులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో మట్టి రోడ్లు బురద మాయంగా మారటంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లడం రైతులు వ్యవసాయం ఉత్పత్తుల మార్కెట్ కు తరలించడం అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆసుపత్రులకు తీసుకెళ్లడం కూడా కష్టతరంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలోని ప్రతి గిరిజన గూడెం మరియు నివాస ప్రాంతాల్లో ఇంటర్నల్ సిమెంట్ రోడ్లు నిర్మించేందుకు ప్రత్యేక కార్యచరణ ప్రణాళిక రూపొందించి వెంటనే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల దశలవారు ఉద్యమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ వెంకటాపురం మండల ఉపాధ్యక్షులు తాటి రాంబాబు, సోడి గోపి,చందా సూరిబాబు, మీడియం అర్జున్ పాల్గొన్నారు.

# కోటగుట్ట టన్నెల్ పనులు వెంటనే ప్రారంబించాలి



**--సిపిఎం డిమాండ్.**

**జూలూరుపాడు/చంద్రుగొండ(భద్రాద్రి న్యూస్)ప్రతినిధి :**
మంత్రులు, ఎమ్మెల్యేలు అబద్దాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగాన్ని మోసం చేస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ , భద్రాద్రి కొత్తగూడెం , ఖమ్మం జిల్లా కార్యదర్శులు మచ్చ వెంకటేశ్వర్లు ,నున్నా నాగేశ్వరరావు లు విమర్శించారు . మంగళవారం సిపిఎం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ఆగిపోయిన టన్నెల్ పనులను వారు పరిశీలించారు, ఈ కార్యక్రమంలో పోతినేని సుదర్శన్ సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు సిపిఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి. నున్నా నాగేశ్వరరావు. సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మాచర్ల భారతి సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు అన్నవరపు కనకయ్య సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కళ్యాణం వెంకటేశ్వరరావు సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేష్ సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వై విక్రం సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు రేపాకుల శ్రీనివాస్ సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు. బండి పద్మ సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ఎర్ర శ్రీనివాసరావు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సభ్యులు మడిపల్లి గోపాలరావు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు. మెరుగు సత్యనారాయణ సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యలమంచి వంశీకృష్ణ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సభ్యులు. భూక్యా రమేష్ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మర్మం చంద్రయ్య జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన వెంకటేశ్వర్లు పార్టీ మండల కార్యదర్శి యాసా నరేష్ మండల కమిటీ సభ్యులు చందర్ రావు,గార్లపాటి వెంకటి, గడిదేసి కానకరత్నం కోటేశ్వరరావు పెరుమాళ్ళవెంకటేశ్వర్లు బోడాఅభిమిత్ర బల్లి లక్ష్మయ్య ఎల్లంకి సీతారాములు బానోత్ సామ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 20న కలెక్టరేట్ ధర్నాలో పాల్గొనండి

**టి యు సి ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఏదులాపురం గోపాలరావు**



**జూలూరుపాడు/చంద్రుగొండ(భద్రాద్రి న్యూస్)ప్రతినిధి :**
మండల గౌరవప్రద జీవన కనీస వేతనంకై ఆగస్టు 20 న ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరుగుతున్న దేశ వ్యాపిత ఆందోళనల్లో భాగంగా కలెక్టరేట్ ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని టి యు సి ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఏదులాపురం గోపాలరావు కోరారు. మంగళవారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో కార్మికులతో కలిసి కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం గోపాలరావు మాట్లాడుతూ చట్టబద్ధమైన కనీస వేతనాలు కార్మికులు, వారి కుటుంబాల వాస్తవ అవసరాలపై ఆధారపడి లేవని,కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నోటిఫై చేసిన అవసరాల ఆధారిత కనీస వేతనం కంటే చాలా తక్కువగా ఉన్నాయని అన్నారు. తక్కువ వేతనాలు లక్షలాది మంది కార్మికులను, వారి కుటుంబాలను గౌరవప్రదమైన జీవన ప్రమాణాల కంటే తక్కువగా జీవించేలా చేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 15వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ (1957) నిర్దేశించిన చట్టబద్ధమైన కనీస వేతనం అనేది నిజమైన అవసరాల ఆధారిత కనీస వేతనంగా ఉండాలని, సుప్రీంకోర్టు గుర్తించిన సూత్రాల ప్రకారం నిర్ణయించాలని కోరారు. చట్టబద్ధమైన కనీస వేతనం అనేది కార్మికుడు మరియు కుటుంబం ఆరోగ్యం, పని సామర్థ్యం, నైపుణ్యం మరియు గౌరవాన్ని కాపాడుకోవడానికి సరిపోయేదిగా వుండాలని అన్నారు.
కార్మికుడు, జీవిత భాగస్వామి, ఇద్దరు పిల్లలతో కూడిన 3 యూనిట్ల ప్రమాణికతతో శ్రామిక కుటుంబం. డాక్టర్ వాలెస్ ఆర్. ఆక్రోయిడ్ సిఫార్సు చేసినట్లుగా రోజుకు ఒక వయోజనుడికి 2,700 క్యాలరీల ఆధారంగా పోషకాహారం అవసరమని,డిటర్జెంట్లతో (సబ్బులు) కలిపి సంవత్సరానికి 72 గజాల (నెలకి 5.5 మీటర్లు) దుస్తులు అవసరంమని,ప్రభుత్వ పారిశ్రామిక గృహ నిర్మాణ పథకం (ఇండస్ట్రియల్ హౌసింగ్ స్కీమ్) కింద ఉన్న కనీస విస్తీర్ణం ఆధారంగా ఇల్లు. ఇంధనం, వెలుతురు, ఇతర ఖర్చులు మొత్తం కనీస వేతనంలో 20% ఉండాలని,పిల్లల విద్య, వైద్యం, వినోదం, పండుగలు, శుభకార్యాల కోసం అదనంగా 25% కేటాయించాలని గౌరవనీయ సుప్రీంకోర్టు రాప్టాకోస్ బ్రెట్ అండ్ కో లిమిటెడ్ కేసులో పేర్కొన్నదని తెలిపారు. 2026 మే లో ఉన్న రిటైల్ ధరల ఆధారంగా కార్మికులకు నెలకు 39,373 రూపాయలు కంటే తక్కువ ఉండరాదని గణాంకాలు చెబుతున్నాయని గోపాలరావు తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని గోపాలరావు కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కార్మికులు శిరీష,సునీత, రమాదేవి, నిర్మల, స్వరూప, అరుణ, రాధా, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణికుల సేవలు, ఆదాయ వృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోలోమన్,**
**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 18 (భద్రాద్రిన్యూస్ ):-**



టీజీఎస్ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ సోలోమన్ ఖమ్మం రీజియన్ పర్యటనలో భాగంగా ఖమ్మం రీజియన్ పరిధిలోని డిపో మేనేజర్లతో ఓల్డ్ బస్ స్టేషన్ లో గల రీజినల్ ఆఫీస్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రీజియన్లోని డిపోల పనితీరు, ప్రయాణికులకు అందుతున్న సేవలు, బస్సుల నిర్వహణ, ఆదాయ వృద్ధి, కొత్త రూట్ల అవకాశాలు తదితర అంశాలపై డిపోల వారీగా సమగ్రంగా సమీక్షించారు, అంతకుముందు, కొత్త బస్సు స్టాండ్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కొత్త బస్టాండ్ కాన్ఫరెన్స్ హాల్ నందు ఏర్పరచిన రక్తదాన శిబిరం లో పాల్గొని రక్తదానం చేసి నార 3, ఇట్టి కార్యక్రమం లో సుమారు 20 మంది రక్త దానం చేసారు. ప్రయాణికులకు మెరుగైన, సురక్షితమైన, సౌకర్యవంతమైన రవాణా సేవలు అందించడమే సంస్థ ప్రధాన లక్ష్యమని ఈడీ సోలోమన్ పేర్కొన్నారు. బస్సుల నిర్వహణ విషయంలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా, ప్రతి బస్సును నిర్ణీత షెడ్యూల్ ప్రకారం తనిఖీ చేసి, సాంకేతిక లోపాలను ఎప్పటికప్పుడు సరిచేయాలని సూచించారు. బస్సుల పరిశుభ్రత, ఫిట్నెస్, సమయపాలన తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. బస్ స్టేషన్లలో పరిశుభ్రత, తాగునీరు, ప్రయాణికులకు అవసరమైన మౌలిక సదుపాయాలు వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని ఈడీ సూచించారు. డిపో మేనేజర్లు మరింత అంకితభావం, బాధ్యతాయుత దృక్పథంతో పనిచేసి తమ తను డిపోల అభివృద్ధికి కృషి చేయాలనిఈడీ సోలోమన్ సూచించారు. అందుబాటులో ఉన్న బస్సులు, సిబ్బంది మరియు ఇతర వనరులను సమర్ధవంతంగా వినియోగించుకొని, డిపోల పనితీరును మెరుగుపరచడంతో పాటు ఆదాయాన్ని పెంచే దిశగా కార్యాచరణ చేపట్టాలని తెలిపారు.ప్రతి డిపో పనితీరును నిరంతరం సమీక్షిస్తూ, మెరుగైన ఫలితాలు సాధిస్తున్న డిపోల విధానాలను ఇతర డిపోల్లో కూడా అమలు చేయాలని సూచించారు. సమిష్టి కృషితో ఖమ్మం రీజియన్ను ఆదాయం, ప్రయాణికుల సేవలు మరియు నిర్వహణ పరంగా మరింత ముందుకు తీసుకెళ్లాలని ఈడీ పిలుపునిచ్చారు. ఈ సమీక్ష సమావేశంలో రీజినల్ మేనేజర్ సరిరాం, డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య, ఖమ్మం రీజియన్ పరిధిలోని డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వం తరపున గణేశ్ ఉత్సవాలకు సహకారం అందించాలని కలెక్టర్ కు వినతి

ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 18 (భద్రాద్రిన్యూస్ ):-
గణేష్ ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ను స్తంభాద్రి ఉత్సవ సమితి కలిసి వినతిపత్రం అందించారు. ఖమ్మం నగరంలోని శ్రీ గణేష్ మండప నిర్వాహకుల ఐక్యవేదిక నుండిజిల్లా కలెక్టర్ ను కలిసిన వారుఅధ్యక్షులు వినోద్ లాహోటి,వర్కింగ్ ప్రెసిడెంట్ గెంటెల విద్యాసాగర్,ప్రధాన కార్యదర్శి కీసర జయపాల్ రెడ్డి,కన్వీనర్ కన్నం ప్రసన్న కృష్ణ,ఆర్గనైజింగ్ సెక్రటరీ అల్లిక అంజయ్య ,కోశాధికారి మూలగుండ్ల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు





# ప్రభుత్వ, గిరిజన భూముల కబ్జాలకు అడ్డుకట్ట వేయాలి

**ములుగు కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన ఆదివాసి నవనిర్మాణ సేన**
**సాగునీటి ప్రాజెక్టులకు నిధులు విడుదల చేసి రైతులను ఆదుకోవాలి**
**ఎరువుల ఆన్‌లైన్ విధానాన్ని ఏజెన్సీ రైతులకు సులభతరం చేయాలి**



**ములుగు, ఆగస్టు 18 – భద్రాద్రి న్యూస్:**
వాజేడు, వెంకటాపురం ఏజెన్సీ మండలాల్లో ప్రభుత్వ, గిరిజన భూముల కబ్జాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని, వాటిపై వెంటనే సమగ్ర విచారణ చేపట్టాలని ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షుడు కొర్రస నర్సింహమూర్తి ములుగు జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం ములుగు కలెక్టరేట్‌లో ఎల్.ఎన్.ఓ ప్రభావం, పంటల మార్కెటింగ్, నీటి యాజమాన్యంపై జరిగిన అవగాహన సదస్సులో పాల్గొని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో రైతులు, గిరిజనులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా పాలేం వాగు ప్రాజెక్టు ప్రధాన కాలువకు మరమ్మతులు చేపట్టి నీటి సామర్థ్యాన్ని పెంచాలని, డిప్పెబ్యాకట రిజర్వాయర్‌కు గేట్లు ఏర్పాటు చేసి కాలువలో పూడిక తీయాలని డిమాండ్ చేశారు. బర్లగూడ పంచాయతీ చిన్నగనారం వద్ద కాలువకు గండి పడి వేలాది లీటర్ల నీరు వృథాగా పోతున్నందున వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు.
పదివేల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టుకు తగిన నిధులు విడుదల చేయాలని, నిధుల కొరతతో గత రెండేళ్లుగా వేలాది ఎకరాల పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువుల ఆన్‌లైన్ విధానం ఏజెన్సీ రైతులకు ఇబ్బందిగా మారిందని, రైతులకు సులభంగా ఎరువులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా LTR చట్టాన్ని ఉల్లంఘిస్తూ వలస గిరిజనేతరులకు ప్రభుత్వ, గిరిజన భూములపై అక్రమ పట్టాలు ఇస్తున్నారని ఆరోపించారు. వాటిపై సమగ్ర విచారణ జరిపి అక్రమ పట్టాలను రద్దు చేసి అసలైన లబ్ధిదారులకు భూములు అందించాలని కోరారు. కౌలు రైతులకు కూడా న్యాయం చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో ఆదివాసీ నవనిర్మాణ సేన జిల్లా కన్వీనర్ కుంజ మహేష్, మహిళా నాయకులు ముర్రం రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# గుగులోతు సక్రు కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే డా. బానోతు చంద్రావతి.





**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 18( భద్రాద్రిన్యూస్ ):-**
గద్దలగూడెం పంచాయతీ విక్రమ్‌నగర్ గ్రామానికి చెందిన గుగులోతు సక్రు మృతి చెందగా, వారి కుటుంబాన్ని వైరా మాజీ ఎమ్మెల్యే డా. బానోతు చంద్రావతి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ కమిటీ సభ్యులు ఇస్లావత్ శ్రీను, గుగులోతు బాబు, బానోతు శంకర్, బోడ శ్రీను, బానోతు హరి, బోడ పాపారావు, బానోతు నరేష్, లింగాల నరేష్, బోడ లోకయ్య, గుగులోతు సీతారాం, బోడ బికు, గుగులోతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి న్యూస్

బుధవారం 19,ఆగస్టు, 2026

# కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో జాప్యం లేకుండా చర్యలు




**దిశా కమిటీ చైర్మన్, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి**

**ఆసుపత్రులకు అవసరమైన వైద్య పరికరాల కొనుగోలుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి**

**గురుకులాలు, పాఠశాలల్లో ఆహార నాణ్యతపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి**

**గిరిజన ప్రాంతాల్లో 124 ఐసోలేటెడ్ ఆవాసాలకు శాశ్వత త్రాగునీటి సౌకర్యం కల్పించాలి**

**అటవీ అనుమతుల సమస్యలతో అభివృద్ధి పనులు, రైతులు ఇబ్బందులు పడకుండా పరిష్కరించాలి**

**అమృత్ పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేసి దెబ్బతిన్న రహదారులను పునరుద్ధరించాలి**

**పీఎంఏవై, ఉపాధి హామీ పథకాల పెండింగ్ చెల్లింపులను త్వరగా పరిష్కరించాలి**

**దిశా కమిటీ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష**

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 18 (భద్రాద్రిన్యూస్ ):-**

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని దిశా కమిటీ చైర్మన్, ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి అన్నారు.

కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం మధ్యాహ్నం ఖమ్మం ఎంపీ, దిశా కమిటీ చైర్మన్ రామ సహాయం రఘురాం రెడ్డి అధ్యక్షతన దిశా కమిటీ సర్వసభ్య సమావేశాన్ని మహబూబాబాద్ ఎంపీ పి. బలరాం నాయక్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు లతో కలిసి నిర్వహించారు. గత దిశా కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై అధికారులు సమర్పించిన యాక్షన్ టేకన్ రిపోర్టును సమావేశంలో పరిశీలించారు. ఆరోగ్యం, త్రాగునీటి సరఫరా, విద్య, ఉపాధి హామీ పథకం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, బీఎస్ఎన్ఎల్, రైల్వేలు, జాతీయ రహదారులు, స్వచ్ఛ భారత్ మిషన్, అమృత్ ల, తదితర కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూలిఆసుపత్రులకు అవసరమైన సిటీ స్కాన్ వంటి వైద్య పరికరాల కొనుగోలుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అన్నారు. అవసరమైన వైద్య పరికరాల కోసం సంబంధిత ప్రజాప్రతినిధులు సీఎస్ఆర్ నిధులను సమీకరించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలని, దీనిపై నివేదిక సమర్పించి ప్రభుత్వ స్థాయిలో అవసరమైన చర్యలు తీసుకునేలా చూస్తామని తెలిపారు. జిల్లాలో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ 80 శాతం పూర్తయిందని, మిగిలిన అర్హులందరికీ వ్యాక్సినేషన్ పూర్తి చేయాలని అన్నారు. గుండాల ఘటనకు ఎవరు బాధ్యులో, ఇప్పటివరకు తీసుకున్న చర్యలేమిటో పూర్తి వివరాలతో డీఎంహెచ్ఓ 48 గంటల్లో కలెక్టర్‌కు యాక్షన్ టేకన్ రిపోర్టు సమర్పించాలని ఆదేశించారు. పనుల మంజూరు లేదా నిధులకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, నిధుల కోసం తాము ప్రభుత్వ స్థాయిలో ఫాలోఅప్ చేస్తామని అన్నారు. అయితే పనులను పెండింగ్‌లో ఉంచి కాలయాపన చేయవద్దని, సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. కొత్తగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లకు వెంటనే త్రాగునీటి కనెక్షన్లు ఇవ్వాలని, అవసరమైన హ్యాండ్‌పంపుల మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ఓహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంకులు, పైప్‌లైన్‌లకు ప్రతిపాదించిన పనుల ప్రస్తుత స్థితిపై నివేదిక సమర్పించాలని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో త్రాగునీటి కొరత ఉన్న ప్రాంతాలను గుర్తించి, అవసరమైన చోట ప్రత్యామ్నాయ వనరుల ద్వారా నీటిని అందించాలని సూచించారు. గురుకులాలను సందర్శించిన సమయంలో మధ్యాహ్న భోజనానికి అవసరమైన కూరగాయలు, గుడ్లు వంటి సరుకులు తగినంతగా లేవని గుర్తించినట్లు ఎంపీ తెలిపారు. టమాటాలను ఎలుకలు కొరికిన పరిస్థితిలో ఉన్నాయని, సరుకుల బ్యాగులు తెరిచి ఉంచారని, నిర్దేశించిన డైట్‌లో 50 శాతం కూడా అమలు కావడం లేదని, మూడు రోజుల పాటు ఒకే కూర వడ్డించిన పరిస్థితిని గమనించినట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని గురుకులాలు, పాఠశాలల జాబితాను సిద్ధం చేసి సిబ్బందికి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి వారం కనీసం ఐదు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేయాలని సూచించారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందకపోవడం ఆమోదయోగ్యం కాదన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పట్టణ ప్రాంతాలకు పీఎంఏవై కింద మంజూరైన 1,590 ఇళ్ల లబ్ధిదారుల జాబితాను సమర్పించాలని అన్నారు. పీఎంఏవై చెల్లింపులకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, సమస్యాత్మక కేసుల వివరాలను ప్రత్యేకంగా నివేదించాలని సూచించారు.

కొత్తగూడెం వంటి ముఖ్యమైన రైల్వే స్టేషన్‌కు అమృత్ స్టేషన్ పనులు చాలా నెమ్మదిగా జరుగుతున్నాయని, ఈ విషయాన్ని తాను రైల్వే మంత్రికి కూడా తెలియజేసినట్లు ఎంపీ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భూమి మార్పిడి చేయడంతో పాటు భూమి విలువను కూడా చెల్లించినప్పటికీ, రెండేళ్లు గడిచినా రైల్వే భూమిని రాష్ట్రానికి అప్పగించలేదని తెలిపారు.




అమృత్ పథకం కింద మంజూరైన అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అన్నారు. పైప్‌లైన్ పనుల్లో శాఖల మధ్య సరైన సమన్వయం ఉండేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని, పైప్‌లైన్‌లు వేసిన తర్వాత రహదారులను గతంలో ఉన్న విధంగానే పునరుద్ధరించాలని సూచించారు.




గిరిజన ప్రాంతాల్లో అటవీ అనుమతుల కారణంగా విద్యుత్ లైన్లు, రహదారులు, పట్టా భూములకు సంబంధించిన సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డీఎఫ్ఓలు స్థానిక ఎమ్మెల్యేలతో సమయం కేటాయించి సమస్యలను నమోదు చేసుకుని త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.



అడవులను ధ్వంసం చేయాలని తాము కోరడం లేదని, అడవులను సంరక్షిస్తూనే ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని అన్నారు.

మహబూబాబాద్ ఎంపీ పి. బలరాం నాయక్ మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో ఎంఆర్ఐ, సీటీ స్కాన్ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించాలని అన్నారు. ఆసుపత్రుల్లో పడకల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల మంత్రులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా స్థాయి నుంచి సంపూర్ణ నివేదిక అందలేదని తెలిసిందని, అవసరమైన వైద్య పరికరాలు, ఇతర అవసరాలకు సంబంధించి సమగ్ర నివేదిక అందించాలని కోరారు.

విద్య, వైద్యం, రైల్వేలు తదితర రంగాలకు కేంద్రం నుంచి నిధులు తీసుకురావడానికి తాము నిరంతరం కేంద్ర మంత్రులతో ఫాలోఅప్ చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గృహ నిర్మాణ శాఖకు అవసరమైన నిధుల కోసం కూడా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. జిల్లాలోని 124 ఐసోలేటెడ్ హ్యాబిటేషన్లకు శాశ్వత తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతాల అభివృద్ధికి వేల కోట్ల బడ్జెట్ కేటాయిస్తున్న నేపథ్యంలో రహదారులు, త్రాగునీరు, ఇతర మౌలిక వసతుల కోసం అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని అన్నారు. ప్రతిపాదనలు లేకుండా కేంద్రం నుంచి నిధులు ఎలా తీసుకురాగలమని అన్నారు. అటవీ భూములకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, పోడు రైతులు తమ పశువులను అడవిలోకి తీసుకెళ్లినప్పుడు రోజుల తరబడి ఇబ్బందులకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో 44 సబ్ సెంటర్లు, 14 పీహెచ్‌సీలు, 3 సీహెచ్‌సీల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు వైద్య ఆరోగ్య శాఖకు సమర్పించినట్లు చెప్పారు. గుండాలలో 5 పడకల డయాలసిస్ కేంద్రం మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పాలసీ క్రింద ఏజెన్సీ ప్రాంతాల్లో సిటీ స్కాన్ మంజూరు చేస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. జిల్లాలో 124 ఐసోలేటెడ్ హ్యాబిటేషన్లు ఉన్నాయని, ప్రస్తుతం స్థానిక నీటి వనరుల ఆధారంగా సోలార్ వ్యవస్థల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామని తెలిపారు. అటవీ అనుమతుల సమస్యల కారణంగా వాటికి శాశ్వత త్రాగునీటి సరఫరా కల్పించలేక పోతున్నామని వివరించారు. కొత్తగూడెం జిల్లాలో ఉపాధి హామీ పథకం క్రింద రూ.17 కోట్ల వేతన బకాయిలు, రూ.50 కోట్ల మెటీరియల్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఇకపై దిశా సమావేశాలకు అటవీ, పోలీస్ శాఖల అధికారులు కూడా తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలని కోరారు. వైద్య శాఖలో అధికారుల బాధ్యతలను స్పష్టంగా విభజించాలని సూచించారు. జిల్లాలో 116 మంది వైద్యులు, 52 మంది నర్సులు, 45 మంది పారామెడికల్ సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. స్థానిక అభివృద్ధి పనులకు డీఎంఎఫ్‌టీ నిధులను విడుదల చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం మరింత మెరుగు పడాలని, ఆసుపత్రులు సక్రమంగా పనిచేయకపోతే దాని ప్రభావం ప్రజాప్రతినిధులపై కూడా పడుతుందని అన్నారు. అర్హులైన దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లు అందించాలని, వృద్ధుల లైవ్ అథెంటికేషన్ లో వేలిముద్రలు పడకపోవడం వల్ల ఎదురవుతున్న సమస్యలను ఐరిస్ సాంకేతికతను వినియోగించి పరిష్కరించాలని కోరారు. రైల్వే స్టేషన్ పేరును 'భద్రాచలం రోడ్' నుంచి 'కొత్తగూడెం'గా మార్చేందుకు ఎంపీ ద్వారా అవసరమైన అభ్యర్థన లేఖ, ప్రతిపాదనను సమర్పించాలని కోరారు. అమృత్ పథకం క్రింద పైప్‌లైన్ పనుల సమయంలో దెబ్బతిన్న రహదారులను వెంటనే పునరుద్ధరించాలని, దీనిపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని అన్నారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వకుండా వైద్య సిబ్బందిని బదిలీ చేయడం, డిప్యూటేషన్‌పై పంపడం చేయకూడదని అన్నారు. శివలింగాపురం పీహెచ్‌సీలో వైద్యులను బదిలీ చేయడంతో ప్రస్తుతం ఖాళీ ఏర్పడి అనేక సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. 100 పడకల ఆసుపత్రి ప్రస్తుతం బాగా పనిచేస్తోందని, అయితే ఇటీవల గడువు ముగిసిన సెలైన్ బాటిల్‌ను రోగికి అందించడం వల్ల పరిస్థితి విషమించిన ఘటన పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.మేఘా కాంట్రాక్టర్‌కు సంబంధించిన ఓహెచ్ సిబ్బంది సమ్మె కారణంగా మూడు రోజుల పాటు త్రాగునీటి సరఫరా నిలిచి పోయిందని, దీనికి బాధ్యత ఎవరిదో పరిశీలించాలని కోరారు. నీటి సరఫరా మూడు రోజుల పాటు ఎందుకు నిలిచిపోయిందో, ప్రజలు రోడ్లపైకి వచ్చి సమస్య పరిష్కారం కోసం ఆందోళన చేయాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడిందో సమీక్షించాలని అన్నారు. అర్హులైన వారికి కొత్త పింఛన్లు అందించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని, గిరిజన ప్రాంతాల్లో కనెక్టివిటీ తక్కువగా ఉన్నందున గ్రామస్థాయిలో అవసరమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అమృత్ పథకం క్రింద మంజూరైన వాటర్ ట్యాంకులు, కొత్త పైప్‌లైన్ పనులను డిసెంబర్ 2026 నాటికి పూర్తి చేయాలని, క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో అవసరమైన పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లను ప్రతిపాదించి నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. ఇల్లందు ఏరియా ఆసుపత్రిలో సీడీపీ మెషిన్, ఎక్స్‌రే, టిఫా స్కానింగ్ వంటి సదుపాయాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఇల్లందు పట్టణంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణంలో ఉందని, ఇక్కడ నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ ఆసుపత్రుల అభివృద్ధిపై నిర్వహించే సమావేశాల్లో ప్రజాప్రతి నిధులను భాగస్వామ్యం చేయాలని అన్నారు. తమకు సమాచారం లేకుండా వైద్య శాఖ సిబ్బందిని బదిలీ చేయకూడదని కోరారు. పీజీ వైద్యులను రిలీవ్ చేసే సమయంలో ప్రత్యామ్నాయ వైద్యుడిని ఏర్పాటు చేసిన తర్వాతే రిలీవ్ చేయాలని సూచించారు. అటవీ ప్రాంతాల్లో విద్యుత్ కనెక్షన్లు, రహదారులు, కనీస మౌలిక వసతుల కల్పనకు అవసరమైన అటవీ అనుమతులు ఇవ్వాలని అన్నారు. అడవులను సంరక్షించడంతో పాటు గిరిజన ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత కూడా ఉందని తెలిపారు. అనంతరం జిల్లాలో ఇటీవల మరణించిన అటవీ శాఖ సిబ్బంది బానోత్ నవీన్ బీటీ ఆఫీసర్ కు దిశా సమావేశం ఒక నిమిషం మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి.వేణు గోపాల్, ఐటిడిఏ పిఓ రాహుల్, భద్రాద్రి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్ రావు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, కొత్తగూడెం నగరపాలక సంస్థ మేయర్ మూడ్ గణేష్, డిఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, డిఆర్డిఓ విద్యా చందన, మునిసిపల్ చైర్ పర్సన్లు, దిశ కమిటీ సభ్యులు, సర్పంచ్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.